నేడు మంత్రి క్యాంపు కార్యాలయంలో మెగా ప్రజాదర్బార్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మంత్రి క్యాంపు కార్యాలయంలో ఈ నెల 28వ తేదీ శుక్రవారం మెగా ప్రజా దర్బార్ నిర్వహించనున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలో నూజివీడు పట్టణ, మండల ప్రజల శ్రేయస్సు, మెరుగైన సేవలు అందించడం కోసం, ప్రజా సమస్యల పరిష్కార వేదికను మంత్రి క్యాంపు కార్యాలయంలో ఉదయం తొమ్మిది గంటల నుంచి ఏడు గంటల వరకు నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ వేదికలో తహశీల్దార్, మండల అధికారులు, రెవెన్యూ, విద్యుత్, ఆర్‌అండ్‌బి, హెల్త్, తదితర ప్రభుత్వ అధికారులందరూ హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతారని మంత్రి తెలిపారు. ఈ ప్రజా వేదికను నాయకులు, అధికారులందరూ సమన్వయంతో కలిసి పనిచేసి విజయవంతం చేయాలని మంత్రి కోరారు.

2026 డిసెంబరు నాటికి..
పునరావాసం పూర్తి చేస్తాం..

2027 డిసెంబర్ నాటికి ప్రాజెక్టు పనులు పూర్తి

అర్హులైన ప్రతి ఒక్కరికీ పరిహారం అందిస్తాం.

నిర్వాసితుల ఆదాయం పెంచేందుకు ప్రత్యేక చర్యలు

పోలవరం నిర్వాసితులతో ముఖాముఖిలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్యాకేజీ అమలుకు కటాఫ్ తేదీ మార్చాలని నిర్వాసితుల వినతి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, పోలవరం

'పోలవరం ప్రాజెక్టు ఎపికి జీవనాడి. ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. పోలవరం ప్రాజెక్టు నుంచి నీళ్లు విడిచి పెట్టకముందే నిర్వాసితులందరికీ పునరావాసం పూర్తి చేస్తాం. ఆ తర్వాతే ప్రాజెక్టుకు నీళ్లు నింపి ప్రారంభిస్తాం.'____అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

పోలవరం ప్రాజెక్టు పనులపై అధికారులతో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను సిఎం చంద్రబాబు గురువారం ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. గురువారం ఉదయం 11 గంటలకు రావాల్సిన సిఎం 12 :10 గంటలకు హెలీకాప్టర్లో పోలవరం చేరుకున్నారు. సిఎంకు పుష్పగుచ్ఛాలిచ్చి మంత్రులు రామానాయుడు, నాదెండ్ల మనోహర్, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, ఎంఎల్ఎలు, ఇతర నాయకులు స్వాగతం పలికారు. కార్యకర్తల నుంచి వినతి పత్రాలను సిఎం స్వీకరించారు. అనంతరం వ్యూ పాయింట్ నుంచి పోలవరం ప్రాజెక్ట్‌ను పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

వినతులు స్వీకరిస్తున్న సిఎం

సమీక్షలో మాట్లాడుతున్న నిర్వాసితురాలు

నిర్వాసితులతో ముఖాముఖి..

సిఎం చంద్రబాబు తొలుత నిర్వాసితులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. నిర్వాసితులు కుక్కునూరుకు చెందిన పరిటాల వరలక్ష్మి, రమాదేవి, కివ్వాక గ్రామానికి చెందిన మంత్రి గోపాలకృష్ణ, రంపచోడవరానికి చెందిన నిర్వాసితులు సిఎంతో మాట్లాడారు. పరిహారం జమపై ఆనందం వ్యక్తం చేస్తూనే 2017 కటాఫ్ తేదీ మార్చాలని, మిగులు భూములకు పరిహారం ఇవ్వాలని వంటి పలు సమస్యలను సిఎంకు తెలిపారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ 2014లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.4,311 కోట్ల పరిహారం చెల్లించామని తెలిపారు. 2019 తరువాత వచ్చిన వైసిపి ప్రభుత్వం ఏనాడూ మీ గురించి పట్టించుకోలేదని తెలిపారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్వాసితుల ఖాతాల్లో రూ.828.25 కోట్లు జమచేశామని తెలిపారు. 2019లో తమ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చి ఉండుంటే 2020 నాటికి ప్రాజెక్టు పూర్తయ్యేదన్నారు. ఆలస్యం చేయడం వల్ల ఖర్చు భారీగా పెరిగిపోయిందని, రూ.400 కోట్లతో డయాఫ్రం వాల్ కడితే వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల కొట్టుకుపోయిందని తెలిపారు. ఇప్పుడు మళ్లీ రూ.990 కోట్లతో కొత్త డయాఫ్రంవాల్ నిర్మిస్తున్నామని తెలిపారు. 2026 డిసెంబర్ నాటికి పునరావాసాలు పూర్తి చేస్తామన్నారు. దళారుల అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. కొందరి పేర్లు తొలగించారని బాధితులు చెబుతున్నారని విచారణ జరిపి అందరికీన్యాయం తీసుకుంటామని సిఎం తెలిపారు. పోలవరానికి కేంద్రం ఇచ్చిన నిధులను గత పాలకులు ఇతర అవసరాలకు మళ్లించారని విమర్శించారు. పునరావాసం కల్పించిన తర్వాత మీ ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రాజెక్టు కోసం గిరిజనులు ఎక్కువ త్యాగం చేశారని, ఇళ్లు నిర్మించుకునే గిరిజనులకు రూ.75 వేలు అదనంగా కూటమి ప్రభుత్వం అందిస్తోందన్నారు.

మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు నాయుడు

పోలవరం ప్రాజెక్టు పనుల పరిశీలన

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం పోలవరం ప్రాజెక్టులోని పలు విభాగాల్లో పనుల ప్రగతిని పరిశీలించారు. పనుల ప్రగతిని జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు, జల వనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ప్రాజెక్ట్ ఎస్ఇ రెడ్డి రామచంద్రరావు, తదితరులు సిఎంకు వివరించారు. అనంతరం అప్పర్ కాపర్‌డ్యామ్ చేరుకొని ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. అనంతరం గ్యాప్ - 1 పనులను పరిశీలించారు. అనంతరం వైబ్రో కంప్యాక్షన్ చేరుకొని పనులను పరిశీలించారు.

నిర్దేశిత సమయంలో పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టేందుకు వెనకాడం

పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను నిర్దేశించిన సమయంలో పూర్తిచేయని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టేందుకు వెనుకాడబోమని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం అధికారులు, కాంట్రాక్టర్లతో సిఎం ప్రాజెక్టు సమావేశం హాల్లో సమీక్షించి మాట్లాడారు. పోలవరం ప్రాజెక్ట్ పనులను 2027 పుష్కరాలకు ముందే పూర్తిచేసి జాతికి అంకితం ఇచ్చేలా లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలన్నారు. ఇందుకుగాను కాంట్రాక్టర్లు వారికి కేటాయించిన పనులను నిర్దేశించిన సమయానికంటే ముందుగానే పూర్తి చేయాలని తెలిపారు. మార్చి నెలాఖరుకు కాంట్రాక్టర్లకు నిర్దేశించిన పనుల్లో కొంతమంది కాంట్రాక్టర్లు వెనుకబడి ఉండడం, కొందరు సమావేశానికి హాజరు కాకపోవడంపై సిఎం స్పందిస్తూ పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తి చేయడంలో కాంట్రాక్టర్లు అలసత్వం వహించొద్దన్నారు. డయాఫ్రమ్ వాల్ నిర్మాణాన్ని 2025 డిసెంబర్ నాటికి పూర్తిచేయాలని, రైట్ మెయిన్ కెనాల్ కనెక్టవిటీలను జులై, 2026 నాటికి పూర్తిచేయాలని తెలిపారు. ఇసిఆర్ఎఫ్ -గ్యాప్ 1 పనులను 2026 మార్చిలోగా పూర్తి చేయాలన్నారు. ఇసిఆర్ఎఫ్ -గ్యాప్-2 పనులను 2027 డిసెంబర్‌కు లక్ష్యంగా నిర్దేశించినప్పటికీ గోదావరి పుష్కరాల కంటే ముందుగానే 2027 ఏప్రిల్ నాటికి పూర్తిచేయాలన్నారు. అర్హులైన నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాపికొండల నుంచి ధవళేశ్వరం వరకూ పర్యాటకంగా హోటళ్లు ఏర్పాటుచేయడం, పోలవరం ప్రాజెక్ట్ వద్ద ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణంతోపాటు, పర్యాటకులను ఆకర్షించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సిఎం అధికారులను ఆదేశించారు. సిఎం వెంట ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ, పోలవరం ఎంఎల్ఎలు చిర్రి బాలరాజు, పితాని సత్యనారాయణ, చింతమనేని ప్రభాకర్, కామినేని శ్రీనివాస్, సొంగా రోషన్‌కుమార్, ఏలూరు రేంజి ఐజి జివిజి అశోక్ కుమార్, కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్‌పి ప్రతాప్ శివకిశోర్ ఉన్నారు.

కొల్లేరు వాసులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రవి

కొల్లేరు వాసులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ప్రజా చైతన్య యాత్రలో సిపిఎం నేతలు డిమాండ్

ప్రజాశక్తి - భీమడోలు

కొల్లేరు ఆపరేషన్ సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ప్రజలకు జీవనోపాధి కల్పించాలని, కొల్లేరు కాంటూరు పరిధిని ఐదు నుంచి మూడుకు తగ్గించాలని సిపిఎం ఏలూరు జిల్లా కమిటీ కోరింది. కొల్లేరు ప్రజల సమస్యలపై సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర గురువారం భీమడోలు మండలంలో కొనసాగింది. దీనిలో భాగంగా ఆగడాల లంకలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం నాయకులు ఎ.రవి, కె.శ్రీనివాస్, ఆర్.లింగరాజు, కట్టా భాస్కరరావు, ఇతరులు మాట్లాడారు. కొల్లేరు పరిధిలో కొల్లేరు ఆపరేషన్‌కు ముందు గతంలో 146 సొసైటీలను పునరుద్ధరించాలని కోరారు. కొల్లేరు సరస్సులోని 13 వేల ఎకరాల జిరాయితీ భూములను హక్కుదారులకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు గ్రీన్ టిబ్యునల్ కేసులో రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేయాలన్నారు. కొల్లేరు ప్రజలు సాగు చేసుకుంటున్న 15 వేల ఎకరాల చేపల చెరువులను ధ్వంసం చేయరాదన్నారు. పర్యావరణ పరిరక్షణ చర్యల్లో భాగంగా కొల్లేరు సరస్సులోకి మురుగునీరు రాకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రతిపాదిత రెగ్యులేటర్లను నిర్మించాలని కోరారు. కొల్లేరులోని ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని కోరారు. కొల్లేరు గ్రామాలకు తాగునీరు, విద్యుత్, రోడ్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. మిశ్రా కమిటీ, శ్రీరామకృష్ణయ్య కమిటీ, అసెంబ్లీ తీర్మానాల మేరకు కొల్లేరు సరస్సును ఛానలైజేషన్ చేయాలని, ముంపు నివారణా చర్యలు చేపట్టాలని, ఉప్పుటేరు ప్రక్షాళన చేయాలని కోరారు.

భీమడోలు మండలంలో సాగిన ప్రజా చైతన్య యాత్ర

ఏలూరు రూరల్ : కొల్లేరు ప్రజల సమస్యలపై సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కొల్లేరు గ్రామాల్లో గురువారం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఏలూరు రూరల్ మండలంలోని పైడి చింతపాడు, పత్తి కోళ్లలంక, గుడివాకలంక, కోటేశ్వర దుర్గాపురం తదితర గ్రామాల్లో సిపిఎం నాయకులు పర్యటించారు. కొల్లేరు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.లింగరాజు, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ తదితరులు మాట్లాడారు. కొల్లేరును 5 నుండి 3వ కాంటూరుకు కుదిస్తామన్న పాలకుల మాటలు నీటి మూటలుగా మిగిలిపోయాయని చెప్పారు. కొల్లేరులో 46 బెడ్ గ్రామాలు, 74 బెల్ట్ గ్రామాల్లో మూడు లక్షల మంది మత్స్యకారులు, దళితులు ఉన్నారన్నారు. 2006లో ఆపరేషన్ కొల్లేరు పేరుతో ఐదో కాంటూరు లోపల ఉన్న వేలాది ఎకరాలను చెరువులన్నింటినీ ధ్వంసం చేసి లక్షలమంది కొల్లేరు ప్రజల జీవనాన్ని నాశనం చేశారన్నారు. 5వ కాంటూరు పరిధిలో 77,138 ఎకరాల చెరువుల ధ్వంసం పేరుతో 86 వేల ఎకరాలకు పైగా చెరువులు ధ్వంసం చేశారన్నారు. 7,500 ఎకరాల సొసైటీ చెరువులు, 13 వేల ఎకరాల్లో జిరాయితీ భూముల చెరువులను ధ్వంసం చేశారన్నారు. దీంతో కొల్లేరు ప్రజల పరిస్థితి గట్టునపడ్డ చేపల్లా మిగిలిందని ఆందోళన వ్యక్తం చేశారు. జిఒ ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణాన్ని పరిరక్షిస్తామనే పేరుతో కొల్లేరును ధ్వంసం చేశారన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, ఉపాధి కల్పన లేదని తెలిపారు. ఈ పరిస్థితుల్లో 15 వేల ఎకరాల్లో గట్లు వేసుకుని కొన్ని చెరువులను కొల్లేరు ప్రజలు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. కొల్లేరు ప్రజల ఉపాధికి నష్టం కలిగించే విధంగా కొంతమంది పర్యావరణం పేరుతో సుప్రీంకోర్టుకు వెళ్లగా కొల్లేరు ప్రజల సాగులో ఉన్న 15 వేల ఎకరాల చెరువులు ధ్వంసం వేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో అధికారులు గట్లు ధ్వంసం చేశారన్నారు. కొల్లేరును 5 నుండి 3వ కాంటూరుకు కుదించాలని, ఇందుకు అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొల్లేరు గ్రామాలకు రోడ్లు, విద్యుత్, ప్రజలకు తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కట్టా భాస్కరరావు, కె.లెనిన్ వివిధ గ్రామాల కొల్లేరు ప్రజలు పాల్గొన్నారు.

కైకలూరు, దెందులూరు వైస్ ఎంపిపి ఎన్నికలు వాయిదా

ప్రజాశక్తి - ఏలూరు

కైకలూరు వైస్ ఎంపిపి ఎన్నికలకు సంబంధించి గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ కేవలం 9 మంది ఎంపిటిసిలు మాత్రమే హాజరయ్యారు. ఇది ఎన్నికలకు అవసరమైన కోరంను చేరుకోలేదు. తరువాత తేదీ 28 నాటికి వాయిదా పడిందని ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్ తెలిపారు. ఎన్నిక నిర్వహణకు సంబంధించి ఎటువంటి శాంతిభద్రతల సమస్యలు లేదా ఫిర్యాదులు అందలేదని, సమావేశానికి సంబంధించి కార్యకలాపాలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు. తిరిగి ఈ నెల 28వ తేదీ ఉదయం 11 గంటలకు ఎన్నికల ప్రక్రియ తిరిగి ప్రారంభమవుతుందని, ఎన్నికల ప్రిసైడింగ్ ఆఫీసర్, ఆర్‌డిఒ తెలిపారు.

దెందులూరు : ఏలూరు గ్రామీణ మండల వైస్ ఎంపిపి ఎన్నిక వాయిదా పడింది. సరిపోయినంత కోరం లేకపోవడంతో ఎన్నికను ఒక రోజు వాయిదా వేసినట్లు ఎన్నికల అధికారి తెలిపారు. వైస్ ఎంపిపిగా పనిచేసిన పైడిచింతపాడుకు చెందిన భలే ప్రసాద్ రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది. మాదేపల్లికి చెందిన నాగరాజు వైస్ ఎంపిపికి పోటీ పడుతున్నారు. ఎన్నిక శుక్రవారం జరగనుంది.

కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన ఏలూరు ఎంపీ మహేష్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం ద్వారా అక్కడ నివసిస్తున్న ప్రజలకు భరోసా కల్పించాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా కొల్లేరు ప్రజల పక్షాన ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ గురువారం లోక్ సభలో మాట్లాడారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కొల్లేరు ప్రాంతంలో సుమారు మూడు లక్షల మందికి పైగా ప్రజలు దీర్ఘకాలికంగా జీవనం సాగిస్తున్నారని తెలిపారు. కొల్లేరు సరస్సు ప్రముఖ పర్యాటక ప్రాంతం గా ఉందని, ఇక్కడికి దేశ విదేశాల నుంచి వచ్చే పక్షులను చూసేందుకు ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు ఆసక్తి చూపుతారని ఎంపీ ప్రస్తావించారు. కొల్లేరు ప్రాంతానికి హద్దులు నిర్ణయించాలని, ఇటీవల సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలతో నిర్దేశించిన పరిమితులు ఈ ప్రాంత రైతులు, ప్రజలపై తీవ్ర ప్రభావం చూపించిందని, సన్న, చిన్నకారు రైతులు సుమారు 21 వేల ఎకరాల భూములు కోల్పోతున్నారని ఎంపీ మహేష్ కుమార్ కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కొల్లేరు ప్రజలు ఆందోళనకు గురవుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కేంద్ర ప్రభుత్వం తో సంప్రదింపులు జరుపుతున్న విషయాన్ని ప్రస్తావించారు. కొల్లేరు సమస్య తరచూ సుప్రీంకోర్టులో విచారణకు వస్తున్నా, ఇక్కడి ప్రజలు, రైతుల వ్యక్తిగత సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తరచూ పునరావృతం అవుతున్న కొల్లేరు సమస్య వల్ల ఇక్కడి ప్రజలు మనుగడ సాగించడం ప్రశ్నార్థకంగా మారిందని, ఇదే కొనసాగితే వలసలు వెళ్లే పరిస్థితి తలెత్తుతుందని ఎంపీ వివరించారు. కేంద్ర ప్రభుత్వం, కేంద్ర అటవీ శాఖ మంత్రి జోక్యం చేసుకొని కొల్లేరు ప్రజల దీర్ఘకాలిక సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎంపీ అభ్యర్థించారు.

ప్రశాంతంగా ఉప సర్పంచుల ఎన్నిక



చింతలపూడి : రేచర్ల ఉపసర్పంచిగా ముత్యాలరావు



దెందులూరు : రామశింగవరం ఉప సర్పంచిగా రమేష్

రేచర్ల ఉపసర్పంచిగా ముత్యాలరావు

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని రేచర్ల పంచాయతీలో జరిగిన ఉపసర్పంచి ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి గాజుల ముత్యాలరావు ఉపసర్పంచిగా గెలుపొందినట్లు ఎన్నికల అధికారి రత్నకుమార్ తెలిపారు. ముత్యాలరావుకు 14 మంది వార్డు మెంబర్లలో పది మంది మద్దతు తెలిపారు.

అచ్చుతాపురం ఉప సర్పంచిగా ధనలక్ష్మి

కొయ్యలగూడెం : మండలంలోని అచ్చుతాపురంలో జరిగిన ఉప ఎన్నికల్లో కూటమి అభ్యర్థి మద్దిపటి ధనలక్ష్మి విజయం సాధించారు. ఆమెను టిడిపి చింతలపూడి నియోజకవర్గ పరిశీలకులు, పోలవరం ఎఎంసి మాజీ ఛైర్మన పారేపల్లి రామారావు కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కొయ్యలగూడెం మండలాధ్యక్షుడు పారేపల్లి నరేష్, జనసేన పార్టీ గ్రామ ప్రెసిడెంట్ వినోద్, మాజీ ఎంపిటిసి చౌడసాని గణేష్, తెలుగు యువత నిమ్మగడ్డ మహేష్ పాల్గొన్నారు.



కలిదిండి : భాస్కరరావుపేట ఉప సర్పంచిగా మేరమ్మ కుమారి

ఎనికెపల్లి గ్రామ ఉప సర్పంచిగా లక్ష్మి

నిడమర్రు : మండలంలోని ఎనికేపల్లి గ్రామ పంచాయతీ ఉప సర్పంచి ఎన్నిక స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం జరిగింది. ఉప సర్పంచిగా ఎనిమిదో వార్డు మెంబర్ సప్పా లక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఇఒపిఆర్‌డి టిఎన్.స్వామి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పుప్పాల మెహర్‌కుమార్, వార్డ్ సభ్యులు పాల్గొన్నారు.

భాస్కరరావుపేట ఉప సర్పంచిగా మేరమ్మ కుమారి

కలిదిండి : మండలంలోని భాస్కరరావుపేట గ్రామ పంచాయతీలో జరిగిన ఉపసర్పంచి ఎన్నికల్లో కూటమి అభ్యర్థి సాలి మేరమ్మ కుమారిని బోర్డు సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం గత ఉపసర్పంచి వేణుగోపాల్ రాజీనామా చేయగా నేడు ఆ పదవికి ఎన్నిక చేపట్టడంతో మేరమ్మ కుమారి ఎన్నికైంది. ఎన్నికల అధికారిగా కైకలూరు ఇఒపిఆర్‌డి కొండలరావు వ్యవహరించారు. ఉపసర్పంచిగా ఎన్నికైన మేరమ్మ కుమారిని టిడిపి మండలాధ్యక్షులు పోకల జోగిరాజు, సర్పంచి గద్దె ఆనంద్‌కుమార్, మాజీ ఉపసర్పంచి పిల్లారిశెట్టి వేణుగోపాల్, నాయకులు అల్లూరి ఎస్ఐ రాజు, మంతెన సుబ్బరాజు, అల్లూరి సతీష్‌రాజు, పంచాయతీ బోర్డు సభ్యులు అభినందించారు.

రామశింగవరం ఉప సర్పంచిగా రమేష్

కొండలరావుపాలెం ఉప సర్పంచిగా దివ్య

దెందులూరు : పెదవేగి మండలంలో కొండలరావుపాలెం, రామశింగవరం గ్రామాల్లో ఖాళీ అయిన పంచాయతీ ఉప సర్పంచి పదవులకు గురువారం ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికల్లో రామశింగవరం ఉపసర్పంచిగా బండారు రమేష్, కొండలరావుపాలెం గ్రామ ఉపసర్పంచిగా కాట్రు దివ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన ఉప సర్పంచులకు ఎన్నికల అధికారులు ధ్రువీకరణ పత్రాలను అందించారు. రామశింగవరం, కొండలరావుపాలెం రెండు పంచాయతీల్లోనూ ఉపసర్పంచి పదవులను నాలుగేళ్ల క్రితం సగం సగంగా ఒప్పందం చేసుకున్నారు. ఆ రెండు చోట్ల కూడా ఏడాది కిందటే అప్పటి ఉపసర్పంచులుగా ఉన్న జిల్లా నాగ లక్ష్మి(రామశింగవరం), మంతెన వీరాస్వామి (కొండలరావు పాలెం) రాజీనామా చేశారు. కాగా ప్రభుత్వం తాజాగా ఉపసర్పంచి పదవుల ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవడంతో ఆ పదవులను భర్తీ చేశారు. రామశింగవరం ఎన్నికల అధికారిగా పెదవేగి మండల ఇఒపిఆర్‌డి షరీఫ్, కొండలరావుపాలెం ఎన్నికల అధికారిగా భీమడోలు మండల ఇఒపిఆర్‌డి సుందరి వ్యవహరించారు. ముదినేపల్లి మండలం ప్రొద్దువాక ఉప సర్పంచిగా దొడ్డకులా వీరాంజనేయులు, మండవల్లి మండలం ముదుతల్లపాడు ఉపసర్పంచిగా వీరబత్తిన జీవమ్మ, లోకుమూడి ఉప సర్పంచిగా వెంట్రపాటి నిర్మల, దెందులూరు మండలం దెందులూరు ఉప సర్పంచిగా బర్మల అప్పారావు ఎన్నికయ్యారు.

కొయ్యలగూడెం : అచ్చుతాపురం ఉప సర్పంచిగా ధనలక్ష్మి



నిడమర్రు : ఎనికెపల్లి గ్రామ ఉప సర్పంచిగా లక్ష్మి

జాతీయస్థాయిలో నూజివీడు సచివాలయ సెక్రటరీ ప్రతిభ

పలువురి అభినందన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పాతపేట సచివాలయ వార్డు వెల్ఫేర్, డెవలప్‌మెంట్ సెక్రటరీ ధనాల రాజ్‌కుమార్ ఆలిండియా సివిల్ సర్వీసెస్ ఖో ఖో టోర్నమెంటులో బ్రౌంజ్ మెడల్ సాధించడం పట్ల నూజివీడు మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి గురువారం అభినందించారు. కమిషనర్ మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 24 వరకు ఢిల్లీలో నిర్వహించిన టోర్నమెంట్‌లో రాష్ట్రం తరపున పురుషుల జట్టులో తృతీయ స్థానం సాధించిన రాజ్‌కుమార్ రాష్ట్ర ఖ్యాతిని జాతీయస్థాయిలో నిలిపినట్లు ప్రశంసించారు. రాజ్‌కుమార్ గతంలోనూ తన ప్రతిభ కనపరిచి అందరి అభినందనలు పొందినట్లు చెప్పారు. రాజ్‌కుమార్ శిక్షణకు తమ వంతు సహకారం అందిస్తామని కమిషనర్ వెంకట రామిరెడ్డి హామీ ఇచ్చారు. రాజ్ కుమార్‌ను పలువురు అధికారులు, ప్రభుత్వ సిబ్బంది అభినందించారు.

ఫార్మాసిస్ట్ అంజలికి న్యాయం చేయాలి

వేధింపులకు పాల్పడిన దీపక్‌పై చర్యలు తీసుకోవాలి

ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు హైమావతి, శ్యామలారాణి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాజమండ్రి కిమ్స్ బొలినేని హాస్పిటల్లో ఫార్మసిస్ట్‌గా పనిచేస్తున్న అంజలి అక్కడ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న దీపక్ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై తక్షణ విచారణ జరిపించాలని, అంజలికి న్యాయం చేయాలని, వేధింపులకు పాల్పడిన దీపక్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.హైమావతి, ఎ.శ్యామలారాణి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫార్మాసిస్టుగా పనిచేస్తున్న అంజలి స్వస్థలం ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం రౌతుగూడెం అని తెలిపారు. రోజురోజుకు మహిళలపై అత్యాచారాలు, దాడులు పెరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, అందుకనే రోజూ ఇటువంటి కేసులు ఎక్కువవుతున్నాయని, అంజలి విధి నిర్వహణలో ఉండగానే ఆత్మహత్యకు ప్రయత్నం చేసిందంటేనే ఏవిధంగా హింసకు గురైందో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇటువంటివి మళ్లీ పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

119 పార్శిల్స్ బహిరంగ వేలం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎపిఎస్ ఆర్‌టిసి ఏలూరు కార్గో పార్శిల్ కార్యాలయంలో ఎవరూ గుర్తించని, ఎవరూ క్లైమ్ చేయని 119 పార్శిల్స్ బహిరంగ వేలం నిర్వహించేందుకు నిర్ణయించినట్లు అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్) జివిఎస్.సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు బహిరంగ వేలం ఈ నెల 28, 29 తేదీల్లో శనివారం ఉదయం పది గంటలకు ఏలూరు కొత్త బస్టాండ్ ఆవరణలో ఉన్న 15వ నెంబర్ ప్లాట్‌ఫారం వద్ద నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వేలం పాటదారులు సదరు బహిరంగ వేలంలో పాల్గొనాలని కోరారు.

లిఖితకు ఉత్తమ మోటివేషనల్ స్పీకర్ ట్రైనర్ సర్టిఫికెట్

ప్రజాశక్తి - దెందులూరు

నైపుణ్యతకు సంబంధించిన శిక్షణలో దెందులూరు గ్రామానికి చెందిన ఎం.లిఖిత అత్యుత్తమ ప్రతిభ కనపరిచినందుకు ఆమె యశ్వర్ ప్రదీప్‌కుమార్, గంప నాగేశ్వరరావు చేతులమీదుగా మోటివేషనల్ స్పీకర్ ట్రైనర్‌గా ప్రశంసాపత్రం అందుకున్నారు. హైదరాబాద్ నగరం సికింద్రాబాద్ హోటల్ మినర్వా గ్రాండ్‌లో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రానికి చెందిన వ్యక్తులకు నైపుణ్యతకు సంబంధించిన ట్రైనింగ్ పూర్తి చేసుకున్న సభ్యులకు రెండు రోజుల కార్యక్రమం ఆఫ్‌లైన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండర్ గంప నాగేశ్వరరావు, యశ్వర్ ప్రదీప్, ప్రెసిడెంట్ రామచంద్రుడు, వైస్ ప్రెసిడెంట్ మాధవి పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ చూపిన ఎం.లిఖితను ప్రశంసించారు.

మాదకద్రవ్యాల వినియోగ నివారణపై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం కళాశాల ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు అధ్యక్షత వహించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. నేటి సమాజంలో మాదకద్రవ్యాల వినియోగం పెద్ద సమస్యగా తయారైందన్నారు. ఈ సమస్యపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ప్రభుత్వ ఆదేశానుసారం ఈగల్ క్లబ్‌లను స్థాపించినట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథి ఈగల్ సెల్ జిల్లా ఇన్‌ఛార్జ్ బి.ఉదయభాస్కర్ మాట్లాడారు. సమాజంలో ఎక్కడైనా మాదకద్రవ్యాల వినియోగం గమనిస్తే 1972 టోల్ ఫ్రీ నెంబరుకు తెలియజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె.అజయ్‌కుమార్, ఈగల్ క్లబ్ ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు వి.వెంకట్రావు, ఎస్.పరమేశ్, అధ్యాపకులు డాక్టర్ ఎం.రాంబాబు, కె.రమేష్, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ పిఆర్.కాన్సుల్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

ప్రజాశక్తి - చింతలపూడి

అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకున్న కౌలు రైతు బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం సమగ్రమైన నూతన కౌలు రైతు చట్టం తీసుకురావాలని కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, ఏపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పి.సోమశేఖర్, కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొంత కృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని యర్రగుంటపల్లిలో రైతు సేవా కేంద్రంలో అధికారులను కలిసి గురువారం వినతిపత్రం అందించారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు అందించారు. ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత 200 మంది పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఇందులో 90 శాతం మంది కౌలు రైతులేనని, గుర్తింపు కార్డులు లేకపోవడం రాష్ట్ర ప్రభుత్వం అందించే నష్ట పరిహారం పొందలేకపోతున్నారని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యే నాటికి ఆర్డినెన్స్ రూపంలోనైనా నూతన కౌలు చట్టం తీసుకొచ్చి కౌలురైతులను ఆదుకోవాలని కోరారు. రైతు సంఘం నాయకులు జంగా రామచంద్రారెడ్డి, కౌలురైతుల సంఘం గ్రామ కమిటీ కార్యదర్శి కుప్పాల సురేష్, ఉమ్మడి శ్రీను, జుజ్జూరు రాజారావు పాల్గొన్నారు.

ఘనంగా రామ్‌చరణ్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా గత నాలుగు రోజుల నుంచి ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రామ్‌చరణ్ యువశక్తి అసోసియేషన్ వారు తెలిపారు. ఏలూరులోని సర్వజన ఆసుపత్రిలో గురువారం గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జనసేన నాయకుడు నారా శేషు పాల్గొన్నారు. ముందుగా కేక్ కట్ చేశారు. అనంతరం నారాశేషు మాట్లాడుతూ గత నాలుగు రోజుల నుంచి ప్రజలకు ఉపయోగపడే బ్లడ్ క్యాంపు, ఫ్రూట్స్ పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. అదేవిధంగా సర్వజన ఆసుపత్రిలో చిన్న పిల్లలకు బేబీ కిట్స్, బాలింతలకు ఫ్రూట్స్ పంపిణీ కార్యక్రమం, పత్తేబాదలో ఉన్న వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నగర అధ్యక్షుడు నగిరెడ్డి కాశీ నరేష్, ధర్మేంద్ర, మెగా ఫ్యామిలీ ఫ్యాన్స్ పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ పరిశీలన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని ఆర్ఆర్.పేటలో ఉన్న అన్నా క్యాంటీన్‌ను నూజివీడు మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకట్రామిరెడ్డి గురువారం పరిశీలించారు. ఆహార పంపిణీపై పేదలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిశుభ్రమైన రుచిగల ఆహారం అందిస్తున్నట్లు అక్కడ ప్రజలు మున్సిపల్ కమిషనర్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, టిడిపి టౌన్ ప్రెసిడెంట్ మల్లిశెట్టి జగదీష్, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎర్త్ లైన్ ఏర్పాటు

ప్రజాశక్తి - ముసునూరు

విద్యుత్ వినియోగదారులకు హెచ్చు తగ్గులు లేకుండా సక్రమమైన విద్యుత్ ఇవ్వాలనే ఉద్దేశంతో ఎర్త్ లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎఇ వీరబాబు తెలిపారు. ముసునూరులో గృహ అవసరాలకు వినియోగించే విద్యుత్ సక్రమంగా అందించే విధంగా ఎర్త్ లైన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇళ్ల యజమానులు కూడా వారి వారి ఇళ్లల్లో విద్యుత్ స్మార్ట్ మీటర్ల వద్ద భూమిలోకి ఎర్త్ లైన్ అమర్చితే వారి ఇంట్లో కూడా హెచ్చుతగ్గులు లేకుండా అవసరమైన మేరకే విద్యుత్ వస్తుందని చెప్పారు. విద్యుత్ పనిముట్లు కూడా సక్రమంగా ఉంటాయని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - టి.నరసాపురం

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదపడతాయని ఎంపిడిఒ జి.మణికుమారి తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిడిఒ సిబ్బంది ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఆమె ప్రారంభించి విద్యార్థులకు చల్లని తాగునీరు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో ఎండలు పెరుగుతున్న దృష్ట్యా మానవతావాదులు చలివేంద్రాలు ఏర్పాటు చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ పి.శేఖర్‌బాబు, టిఎస్.రఘురాముడు, విస్సంపల్లి రవి ప్రకాష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ఈ నెల 28వ తేదీన ద్వారకా తిరుమల సెక్షన్ పరిధిలో మరమ్మతులు, చెట్ల నరికివేత కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కెఎం.అంబేద్కర్ తెలిపారు. దొరసానిపాడు, గుండుగోలనుకుంట గ్రామాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

నాటుసారా స్థావరంపై దాడి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని దిగవల్లి గ్రామంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. ఈ దాడిలో వ్యక్తిని అదుపులోకి తీసుకుని ఐదు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ సిహెచ్.అజయ్‌కుమార్‌సింగ్ తెలిపారు. ఆ వ్యక్తికి సారా సరఫరా చేస్తున్న రేగుంట గ్రామానికి చెందిన మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ భోగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రవీణ్.పగడాల మ తి పై చింతలపూడిలో నిరసన.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

రోడ్డు అంచున అక్రమ నిర్మాణాలు..!

అక్రమంగా వేబ్రిడ్జి నిర్మాణాలు చేపట్టారని ప్రజల ఆవేదన

ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని భయాందోళన

అధికారుల తీరుపై విమర్శలు


రోడ్డు అంచున్న నిర్మించిన వే బ్రిడ్జి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని గవరవరం గ్రామ శివారు తాడేపల్లిగూడెం రోడ్డులో గోడౌన్ నిర్మాణంలో భాగంగా ఆర్అండ్‌బి రోడ్డు స్థలాన్ని ఆక్రమించి వే బ్రిడ్జి నిర్మించారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో యధేచ్ఛగా వే బ్రిడ్జి నిర్మించారని గ్రామస్తులు చెబుతున్నారు. ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు చేస్తున్నారు. ఈ విషయంపై గతేడాది డిసెంబర్ 30వ తేదీన ఆర్అండ్‌బి అధికారులకు గ్రామస్తుడు ఫిర్యాదు చేశాడు. సమస్యకు పరిష్కారం చూపిస్తామని అధికారులు హామీ ఇచ్చి పట్టించుకోలేదు. దీంతో వే బ్రిడ్జిని నిర్మించేశారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల ప్రోత్బలంతోనే ఈ వే బ్రిడ్జి నిర్మాణం జరిగిందని గ్రామస్తులు విమర్శలు చేస్తున్నారు. ఇదే విధంగా రోడ్డు అంచు చాలా చోట్ల ఆక్రమణకు గురవడంతో అనేక రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాపోతున్నారు. ఫిర్యాదులు చేస్తున్నా అధికారులు చర్యలు తీసుకోకుండా వ్యాపారవేత్తలుకు దాసోహంగా ఉంటున్నారని ప్రజలు విమర్శలు చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాలను తొలగించాలి
శుక్లబోయిన రాంబాబు, గ్రామస్తుడు

రోడ్డు అంచు ఆక్రమించి నిర్మిస్తున్న వే బ్రిడ్జిపై నేను 2024 డిసెంబర్‌లో స్పందనలో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశాను. 2025 జనవరి నాటికి సమస్యను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కాని అధికారులు పట్టించుకోకపోవడంతో వే బ్రిడ్జిని నిర్మించారు. అక్రమ నిర్మాణాన్ని తొలగించేందుకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అదేవిధంగా ఇదే రోడ్డులో ఉన్న పాత టుబాకో బోర్డు వద్ద ఉన్న కాట బ్రిడ్జిని కూడా నిబంధనలు విరుద్ధంగా నిర్మించారు. దానిని కూడా తొలగించాలి. అధికారుల నుంచి సరైన స్పందన రాకపోతే దీనిపై పెద్ద ఎత్తున ప్రజానీకాన్ని ఐక్యం చేసి పోరాడుతాం.

కైకలూరు మీదుగా వాడపల్లికి బస్సు

జిల్లా ప్రజా రవాణా అధికారి వరప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రయాణికుల కోరిక మేరకు ప్రతి శనివారం కోనసీమ తిరుపతి పేరుగాంచిన వాడపల్లి క్షేత్రానికి ఏలూరు నుంచి వెళ్లే బస్సును కైకలూరు మీదుగా వెళ్లేందుకు ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌విఆర్.వరప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఏలూరు డిపో నుంచి వాడపల్లి క్షేత్రానికి ప్రతి శనివారం బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కైకలూరు నుంచి వాడపల్లి వెళ్లే ప్రయాణికుల కోరిక మేరకు ప్రతి శనివారం ఉదయం నాలుగు గంటలకు ఏలూరులో బస్సు బయలుదేరి ఐదు గంటలకు కైకలూరు చేరుకుని అక్కడ నుంచి ఆకివీడు, కాపవరం, గణపవరం, పిప్పర, తాడేపల్లిగూడెం మీదుగా వాడపల్లి చేరుకుంటుందని పేర్కొన్నారు. తిరిగి 11.30 గంటలకు వాడపల్లి నుంచి బయలుదేరి పైన వెళ్లిన మార్గంలో కైకలూరు మీదుగా ఏలూరు చేరుకుంటుందని తెలిపారు.

న్యాయవాదులకు స్థలాల కోసం కృషి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు కోర్టు ఆవరణలో మరుగుదొడ్లు, పార్కింగ్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని భారత్ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులు కటారు కరుణాకరరావు తెలిపారు. కోర్టు ఆవరణలో నూతన కార్యవర్గం గురువారం బాధ్యతలు చేపట్టింది. భారత్ బార్ నూతన అధ్యక్షులు కరుణాకరరావు మాట్లాడుతూ తమను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్‌కు సమావేశ మందిరం, న్యాయవాదులకు నివేశన స్థలాల సాధనకు కృషి చేస్తామ న్నారు. సీనియర్ అడ్వకేట్ కీర్తిశేషులు గొల్లపూడి కేశవరం మెమోరియల్ తరపున భారత్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యం లో లైబ్రరీ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు ఆయన వివరించారు.

కౌలు రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

కౌలు రైతు చెన్నారావు కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకోవాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన టి.నరసాపురం పంచాయతీలోని ముత్యాలంపేటలో ఇటీవల కౌలు వ్యవసాయం చేసి అప్పులపాలై చేసిన అప్పులు తీర్చలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన గుర్రం చెన్నారావు కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించి ధైర్యం చెప్పి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెన్నారావు కుటుంబానికి ప్రభుత్వం రూ.పది లక్షలు ఎక్స్ గ్రేషియ ప్రకటించాలని, వ్యవసాయ అప్పులన్నీ రద్దు చేయాలని, అప్పుల వేధింపుదారులపై చర్యలు చేపట్టాలని, తక్షణమే ప్రభుత్వం మూడుసెంట్ల స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించాలని, చెన్నారావు ఇద్దరు పిల్లలను గురుకుల పాఠశాలలో చేర్పించి ఉన్నత విద్య వరకు చదివించాలని, చెన్నారావు భార్య ప్రభావతికి వితంతు పింఛను ఇచ్చి జీవనోపాధి కల్పించడానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంతా కృష్ణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పుల్లూరి సోమశేఖర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల గురవయ్య, సిపిఐ జిల్లా కౌన్సిల్ మెంబర్లు బిఎన్.సాగర్, టి.బాబు పాల్గొన్నారు.

బోదకాలు వ్యాధిగ్రస్తులు పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

బోదకాలు వ్యాధిగ్రస్తులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, అప్పుడే బోదకాలపై ఇతర ఇన్ఫెక్షన్స్ రాకుండా ఉంటాయని జిల్లా మైలేరియా అధికారి పిఎస్-ఎస్.ప్రసాద్ సూచించారు. స్థానిక ఏలూరు పట్టణ ఆరోగ్య కేంద్రం కొత్తపే టలో 45 మంది బోదకాలు వ్యాధిగ్రస్తులకు శుభ్రం చేసుకోవ డానికి మార్బిడిటి మేనేజ్‌మెంట్ కిట్స్‌ను గురువారం అందించారు. ఈ సందర్భంగా పిఎస్ఎస్.ప్రసాద్ మాట్లా డుతూ బోదకాలు మురికి కాలువల్లో పెరిగే ఆడ క్యూలెక్స్ దోమ కుట్టడం వల్ల సంక్రమిస్తుందని తెలిపారు. ఈ కార్య క్రమంలో యుపిహెచ్‌సి కొత్తపేట వైద్యాధికారి డాక్టర్ శశాంక్, అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, హెల్త్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరరావు, హెల్త్ అసి స్టెంట్ శ్రీనివాసరావు, ఆరోగ్య, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

నూజివీడు బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా రమేష్

నూజివీడు బార్ అసోసియేషన్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా మన్నం రమేష్ ఎన్నికయ్యారు. బార్ అసోసియేషన్ ఎన్నిక గురువారం నిర్వహించారు. నూజివీడు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో సెక్రటరీ వై.హరిబాబు, ట్రెజరర్ పి.వేణు, లైబ్రేరియన్ ఎస్‌కెవిడి.ప్రసాద్, లేడీ రిప్రజెంటేటివ్ అక్కినేని రమాకుమారి, వైస్ ప్రెసిడెంట్ రాణి, మేకల సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ దొండపాటి సురేష్‌లు ఎన్నికయ్యారు. నామినేషన్ల సమయంలోనే ఇదే ప్యానెల్‌కు చెందిన ట్రెజరర్‌గా పల్లగాని వేణు, లేడీ రెప్రజెంటేటివ్‌గా అక్కినేని రామకుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో మరొక ప్యానెల్‌కు చెందిన దొండపాటి సురేష్ అనే న్యాయవాది ఒక్కరు మాత్రమే జాయింట్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు ప్రధాన ఎన్నికల అధికారిగా సీనియర్ అడ్వకేట్ బోగోలు చంద్రశేఖరరావు వ్యవహరించగా, ఎన్నికల సహాయ అధికారులుగా న్యాయవాదులు బేతాళ వెంకటేశ్వరరావు, ఎలసి హెచ్.వెంకటేశ్వరరావు వ్యవహరిం చారు. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడంతో న్యాయవాదులంతా ముక్తకంఠంతో ప్రశంసించారు. నూజివీడు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు ఇందుపల్లి సత్యప్రకాష్, పలువురు న్యాయవాదులు ఎన్నికైన కమిటీ సభ్యులను అభినందించారు.

న్యాయవాదులకు కృతజ్ఞతలు
నూజివీడు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులు రమేష్

తమ ప్యానల్ సభ్యులను గెలిపించినందుకు నూజివీడు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులు మన్నెం రమేష్ న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. నూజివీడు కోర్టు ఆవరణలో ఆయన గురువారం మాట్లాడుతూ తమ ప్యానెల్ సభ్యులపై ఉన్న నమ్మకంతో న్యాయవాదులు స్వచ్ఛందంగా ఓట్లు వేసి గెలిపించిన తీరు ఎన్నటికీ మరువలేనిదన్నారు. న్యాయవాదుల పక్షాన, కక్షిదారుల సౌకర్యాల కోసం అహర్నిశలు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తమ ప్యానల్ సభ్యులు ఎల్లవేళలా న్యాయవాదులకు, కక్షిదారులకు అందుబాటులో ఉంటామన్నారు.

ప్రణాళికాబద్ధంగా తాగునీటి సరఫరా చేయాలి

నూజివీడు మండల సమావేశంలో ఎంపిడిఒ చెన్నరాఘవేంద్రనాథ్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

వేసవి కాలం దృష్ట్యా తాగునీటి సరఫరా ప్రణాళికబద్ధంగా ఉండాలని ఎంపిడిఒ చెన్న రాఘవేంద్రనాథ్ అన్నారు. పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయ సమావేశం మందిరంలో గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపిపి ఆరేపల్లి శిరీష అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలు అంశాలు చర్చకు వచ్చాయి. ఈ సందర్భంగా ఎంపిడిఒ చెన్న రాఘవేంద్రనాథ్ మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని ఇంటింటికి నీటి సరఫరాపై దృష్టి సారించాలన్నారు. అందుకోసం ఇప్పటి నుండే ఆయా గ్రామాల సెక్రటరీలు తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర నినాదంగా ముందడుగు వేయాలన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేస్తే జరిమానాలు తప్పవని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించాలని సెక్రటరీలకు సూచించారు. ఉపాధి హామీ చట్టం ద్వారా రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణాలు జరగడంతో పల్లెలు ఎంతో వేగంగా అభివృద్ధి సాధిస్తున్నట్లు చెప్పారు. పలువురు సభ్యులు ఆయా గ్రామాలకు సంబంధించిన సమస్యలు లేవనెత్తగా వాటి పరిష్కారానికి ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తామని తెలిపారు.

దాళ్వా సాగులో తెగుళ్లపై జాగ్రత్త వహించాలి



వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి సుమలత

ప్రజాశక్తి - టి.నరసాపురం

దాళ్వా సాగులో ప్రబలుతున్న తెగుళ్ల పట్ల రైతులు జాగ్రత్త వహించాలని చింతలపూడి వ్యవసాయ సంచాలకులు బి.నాగకుమార్ సూచించారు. మండలంలోని టి.నరసాపురంలో గురువారం మండల వ్యవసాయ శాఖ అధికారి బి.సుమలత ఆధ్వర్యంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న నాగకుమార్ రైతులతో కలిసి వరిపంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో వరి సాగు తగ్గిందన్నారు. రైతులు పురుగుమందులు, రసాయనిక ఎరువులు తగ్గించాలని ప్రకృతి వ్యవసాయంలో లభించే కషాయాలు సరైన సమయంలో పిచికారీ చేసి నాణ్యమైన దిగుబడులు సాధించాలన్నారు. పొలంబడి సాగు రైతులకు ఇండిగాప్ సర్టిఫికెట్ పొందే అవకాశం ఉందన్నారు. వారు మార్కెట్ ధర కంటే అధిక రేట్లకు పంటను అమ్ముకోవచ్చన్నారు. ప్రతిరైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. మండలంలో ఇప్పటివరకు 9,334 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది నరేంద్ర, అనూష, రైతులు దానం సామ్యేల్, దూబా కుటుంబరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల వెరిఫికేషన్

ప్రజాశక్తి- ద్వారకాతిరుమల

రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పథకాలు బిసి, ఇబిసి, కాపు, బ్రాహ్మణ, క్షత్రియ, కమ్మ, రెడ్డి, వైశ్యులకు రాయితీ రుణ సదుపాయం దరఖాస్తు చేసుకున్న వారికి ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం దరఖాస్తులు వెరిఫికేషన్ చేశారు. రాయితీ రుణాలు పొందేందుకు సుమారు 900 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపిడిఒ ప్రకాష్ తెలిపారు.

అంజలికి న్యాయం చేయాలని ర్యాలీ, మానవహారం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ట్రెయినీ డాక్టర్ ఆత్మహత్యాయత్నానికి కారణమైన నిందితుడిని కఠినంగా శిక్షించాలని పిడిఎస్‌యు ఆధ్వర్యంలో బుట్టాయగూడెం విద్యారోహిణి స్కూల్ నుంచి సెంటర్‌లో ర్యాలీ, నెహ్రూ బొమ్మ సెంటర్ వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి నియోజకవర్గ కన్వీనర్ కొండేపాటి రామకృష్ణ మాట్లాడుతూ రాజమండ్రిలో కిమ్స్ ఆసుపత్రిలో ట్రెయినీ డాక్టర్‌గా పని చేస్తున్న అంజలి ఆత్మహత్యాయత్నానికి పాల్పడేందుకు కారణమైన నిందితుడిని కఠినంగా శిక్షించాలన్నారు. అంజలికి వెంటనే న్యాయం చేయాలని కోరారు. లేకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు బి.వినోద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యా రోహిణి పాఠశాల ఉపాధ్యాయులు డి.సుబ్రహ్మణ్యం, వై.రాజు, పిడిఎస్‌యు మండల నాయకులు సిహెచ్.దుర్గాప్రసాద్, ఎం.సలోని, ఎస్‌కె.సుహానా, టి.జాహ్నవి, ఎస్.దివ్య, ఎస్.హారిక, ఎస్.దీప్తి, జె.సాయినాథ్, ఎం.సుధీర్, ఎన్.సత్య, ఎన్.హేమంత్, ఎస్‌కె.షాకీబ్, ఎన్.సంజీవ్, కె.సంతోష్, ఎస్‌కె.జహీర్, పి.క్రాంతి, పి.అభి విద్యార్థులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర న్యాయ విచారణ చేయాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

క్రైస్తవ మత ప్రబోధకుడు ప్రవీణ్ పగడాల మృతి పట్ల సమగ్ర దర్యాపు చేయాలని, ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని మండల ఫైర్ ప్రేయర్ టీమ్ అధ్యక్షులు జి.జ్ఞాన్‌రాజు, గౌరవ అధ్యక్షులు కె.నిరీక్షణరావు, సిహెచ్.హెూషేయలు డిమాండ్ చేశారు. మండలంలోని మర్రిగూడెంలో గురువారం పాస్టర్లు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రవీణ్ పగడాల మృతి క్రైస్తవ సమాజాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ఆయన మృతి వెనుక అనేక అనుమానాలు ఉన్నాయని, ఆయనది ముమ్మాటికీ హత్యేనని ఆరోపించారు. ఆయన మృతి క్రైస్తవ సమాజానికి తీరని లోటన్నారు. ప్రవీణ్ మృతి సంఘటనపై కూటమి ప్రభుత్వం సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని, పోలీసులు, అధికారులు సమగ్ర దర్యాప్తు చేయాలని కోరారు. క్రైస్తవ సేవకులు, సంఘాలపై జరుగు తున్న దాడులను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫైర్ టీమ్ కార్యదర్శి వై.పాల్ చిన్నారావు, టి.ప్రసన్నకుమార్, జకరయ్య, చార్లెస్, జోయల్, జోషప్, దానియేలు పాల్గొన్నారు.

చింతలపూడి : క్రైస్తవ బోధకుడు ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర దర్యాప్తు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని చింతలపూడి మండల పాస్టర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం చింతలపూడి బోస్ బొమ్మ సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పాస్టర్లు సువర్ణరాజు, జాషువా, దయాకర్, స్పెయిన్స్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్యాలయం- లోడిదలంక
కలిదిండి మండలం

ఆర్‌ఓసి.నెంబర్ /2025 **టెండర్ నోటీసు** **తేది.20.3.2025**

కలిదిండి మండలం, **లోడిదలంక గ్రామపంచాయతీ** ఏరియాలో ఈ క్రింది తెలిపిన పనులు చేయుటకు కాంట్రాక్ట్ పద్ధతిపై ముగ్గురు వ్యక్తులు ఒక సంవత్సరము **ది.01.04.2025 నుండి 31.03.2026 వరకు** పనులు చేయుటకు లోడిదలంక గ్రామపంచాయతీ కార్యాలయం నందు ది.29.03.2025. తేదిన ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు టెండర్లు స్వీకరించబడును. అదేరోజు మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషములకు టెండర్ దారుల సమక్షంలో తెరవబడును. మిగిలిన విషయములు కార్యాలయం పని వేళల యందుతెలుసుకొనవలెను.

వ.నెం	టెండర్‌దారుని వివరము	ధరావత్తు
1	స్వీపరు (ఒక వ్యక్తి సేవలు)	రూ.1000 /-
2	ట్యాంక్ వాచర్(ఒక వ్యక్తి సేవలు)	రూ.1000 /-
3	ఎలక్ట్రిషన్(ఒక వ్యక్తి సేవలు)	రూ.1000 /-

నోటీసు :-1. పూర్వము అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
2.గ్రామపంచాయతీ నిధులను బట్టి జీతాలు ఇవ్వబడును.
3. టెండర్లు స్వీకరించుటకు తిరస్కరించుటకు పంచాయతీ వారికి పూర్తి అధికారం కలదు.

సం/- బండి సత్యనారాయణ, సర్పంచ్, గ్రామ పంచాయతీ లోడిదలంక కలిదిండి మండలం.
సం/- sk.ఆసిఫ్, కార్యదర్శి గ్రామపంచాయతీ లోడిదలంక కలిదిండి మండలం.

నేడు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని 18 గ్రామపంచాయతీ పరిధిలో బిసి, ఒసి, కాపు, ఇడబ్ల్యుఎస్ చంద్రన్న స్వయం ఉపాధి కన్వర్జెన్సీ రుణాల దరఖాస్తుదారులకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ విజయలక్ష్మి తెలిపారు. దరఖాస్తుదారులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు కుల ధ్రువీకరణ, తెల్ల రేషన్ కార్డు, బియ్యం కార్డు తీసుకుని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

జిల్లాలో ఉన్న మూడు గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ఐదో తరగతిలో ప్రవేశానికి 6, 7, 8, 9 తరగతుల్లో బ్యాక్‌లాగ్ ఖాళీల్లో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆన్‌లైన్ %https://twreiscet.apcfss.in% ద్వారా అందించాలని కోట రామచంద్రాపురం ఐటిడిఎ పిఒ తెలిపారు. తరగతి, పాఠశాలల వారీగా ఖాళీల వివరాలు తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే నెల తొమ్మిదో తేదీ వరకు గడువు పొడిగించినట్లు పేర్కొన్నారు. ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఉన్న బ్యాక్ లాగ్ ఖాళీలను గిరిజన విద్యార్థిలతో మాత్రమే నింపనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు రాతపరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. వచ్చే నెల 20 తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. మూడు గిరిజన గురుకుల పాఠశాలల్లో ఎక్కడైనా పరీక్ష రాసే అవకాశం ఉందని పేర్కొన్నారు. వారి పిల్లల కోసం దరఖాస్తు చేసుకోవాల్సిన తల్లిదండ్రులు వారి పిల్లల వివరాలు తీసుకుని దగ్గరలో ఉన్న ఏదైనా గురుకుల విద్యాలయానికి వెళ్తే ఉచితంగా ఆన్‌లైన్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అందరూ ఉపయోగించుకోవాలని తెలిపారు.

డిఎస్‌సి కోచింగ్‌కు ఎంపికైనవారికి వెబ్ ఆప్షన్ సర్వీస్

ప్రజాశక్తి - ఏలూరు

ఫేజ్-2 ఉచిత డిఎస్‌సి కోచింగ్ కోసం ఎంపికైన ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థుల వివరాలు జ్ఞానభుమి, %https://mdfc.apcfss.in% వెబ్‌సైట్‌లో పొందుపరచినట్లు సాంఘిక సంక్షేమ శాఖ జెడి వి.జయప్రకాష్ బుధవారం తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 28వ తేదీ లోపు లాగిన్‌లో (కోచింగ్ సెంటర్ పేరు ప్రాధాన్యత వారిగా) వెబ్ ఆప్షన్ ఇవ్వాలని, ఫేజ్-1లో ఎంపికైనవారికి ఎటువంటి వెబ్ ఆప్షన్ మార్చుకునేందుకు అవకాశం లేదని తెలిపారు.

ప్రకటన
మహారాజశ్రీ ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి - కమ్ - ఫస్ట్ అడిషనల్ జూడిషయల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్, పాలకొల్లు
ఐఎ నెం.116/2023 ఇన్ ఓఎస్ నెం.75/2023
బిట్వీన్: బొక్కా ఉషశ్రీ - పిటిషనరు/వాది
వర్సెస్
రావి స్వర్ణసింగ్ వగైరా - రెస్పాండెంట్లు/ప్రతివాదులు
టు,
3వ రెస్పాండెంట్/3వ ప్రతివాది:
రావి మీను మేఘన, తండ్రి: స్వర్ణ సింగ్
రావిపాడు గ్రామం, పోడూరు మండలం, ప॥గో॥ జిల్లా, ఆంధ్రప్రదేశ్
పై నెంబరు పిటీషను/దావాలో 3వ రెస్పాండెంటు/3వ ప్రతివాదికి ఎన్నిసార్లు కోర్టు నుండి సమన్లు పంపించిననూ సదరు సమన్లు మీరు కావాలనే ఉద్దేశ్యంతో తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున పై కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు సమన్లు జారీ చేయుచున్నారు. కావున మీరు పైకోర్టు వారి ఎదుట స్వయంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ ది.8-4-2025వ తేదీ ఉదయం గం.10:30 ని.లకు హాజరై మీ ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించెదరని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
కొల్లి సుందర మాణిక్యాల రావు
అడ్వకేట్, నరసాపురం
బొడ్డుపల్లి శ్రీనివాసరావు, అడ్వకేట్, పాలకొల్లు.

ప్రకటన
మా క్లయింటున్నూ, లోగడ పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం పట్టణము, తాళ్ళముదునూరుపాడు, డోర్‌నెం.10-20-11/3ర, చిరునామా కలిగి, వ్యాపారం చేసిన SRI SUVARNA VARSHINI DEVELOPERS (Reg.No.19/2019) అను భాగస్వామ్య వ్యాపార సంస్థను అందలి భాగస్వాములు అనగా (1) మేడపాటి శ్రీనివాసరెడ్డి 2.మేడపాటి వరలక్ష్మి 3.మేడపాటి చక్రధర్‌రెడ్డి 4.మేడపాటి రమ్య అను వార్లు అందరూ కలిసి ది.25-03-2025 సం॥రం తేదీన స్వచ్ఛందంగా రద్దు చేసుకున్నారనిన్నీ, కావున సదరు భాగస్వామ్య వ్యాపార సంస్థ ఆరోజుతో రద్దు కాబడినదనిన్నీ ఇందు మూలంగా యావన్మందికి తెలియజేయడమైనది.
షేక్ సంధాని భాషా
అడ్వకేట్, తాడేపల్లిగూడెం.
ప.గో.జిల్లా. సెల్: 9390018122

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు వారి దివ్య సముఖమునకు
I.P.No.28/2024
Between:
పెద్దింటి శ్రీనివాస ...పిటీషనరు
మరియు
రెడ్డి సత్యవతి వగైరా ...రెస్పాండెంట్లు
పై నెంబరు పిటీషను న్ను నా క్లయింటు పెద్దింటి శ్రీనివాసు, రెడ్డి సత్యవతి, చిట్టూరి రామలక్ష్మి మరియు అఫీషియల్ రిసీవర్‌లపై ది.6-9-2024వ తేదీన IP.28/24రుగా క్రెడిటర్ పిటీషనున్ను దాఖలు చేసియున్నారు. సదరు పిటీషను నందు శ్రీకోర్టు వారు జనరల్ నోటీసు ప్రచురించమని ఉత్తర్వులు జారీ చేయగా కోర్టు వారి ఆదేశానుసారం ఈ జనరల్ నోటీసు ప్రచురించడమైనది. పై నెంబరు IP.28/24 పిటిషను నందు ప్రజానీకానికి ఎటువంటి అభ్యంతరములు కానీ ఆక్షేపణలు కానీ ఉన్న ఎడల సదరు పిటిషను వాయిదా ది.1-4-2025 తేదీన స్వయముగా కాని, వకీలు ద్వారా కాని ఉదయం 10.30 గం॥లకు శ్రీకోర్టు వారి ఎదుట హాజరయి మీ ఆక్షేపణలు తెలియచేసుకోగలరని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
శివంగుల సుబ్బారాయులు
Md.కరీముల్లా ఖాన్
తాడేపల్లిగూడెం. న్యాయవాదులు, తాడేపల్లిగూడెం.
తేది.26-3-2025 సెల్: 9963285565